క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

వాంకిడి: మండలంలోని కోపగూడ గ్రామానికి చెందిన సిడాం మంగేశ్ అనే భవన నిర్మాణ కార్మికుడు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కార్మిక సంఘం నాయకులు శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. రూ.6300తో పాటు 50 కిలోల బియ్యం మంగేశ్ భార్య సిడాం కళావతికి అందజేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు రాములు, కోశాధికారి సంజీవ్, ప్రధాన కార్యదర్శి నానాజీ, సభ్యులు శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బౌద్ధ ధమ్మ శిబిరం

కౌటాల: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఆదివారం సిర్పూర్ నియోజకవర్గ స్థాయి బౌద్ధ ధమ్మ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అశోక్, ఏమాజీలు శనివారం తెలిపారు. ఈ శిబిరానికి ధమ్మ ప్రబోధకులు దిగంబర్ కాంబ్లె భంతే, లక్ష్మీనారాయణ మసాడే హాజరై బుద్ధుడి బోధనలు వివరిస్తారని తెలిపారు. భారత రాజ్యాంగ అమలు తీరు, చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి శిబిరం ఉంటుందని, సిర్పూర్ నియోజకవర్గంలోని బౌద్ధ ఉపాసక్, ఉపసిక్, గ్రామీనర్లు, అంబేద్కర్ అభిమానులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ విద్యాబోధన



మాట్లాడుతున్న కళాశాల అధ్యాపకులు

తాంసి: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నామని తాంసి కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్ అన్నారు. అధ్యాపకులతో కలిసి శనివారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. తలమడుగు మండలంలోని లింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెళ్లారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వ కళాశాలలో అందిస్తున్న వసతులను తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమణా రెడ్డి, దేవేందర్, మల్లేశ్, అనుపమ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ



బాధితుడికి నగదు అందజేస్తున్న సీఐ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన సాజిద్ అనే ఆటో డ్రైవర్ నిజాయతీ చాటుకున్నాడు. ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వీకి చెందిన మేకల రాములు అనే వ్యక్తి ఆటోలో ప్రయాణించాడు. అతని వద్ద ఉన్న సంచిని ఆటోలో మరిచిపోయి దిగి వెళ్లిపోయాడు. తరువాత గమనించిన ఆటో డ్రైవర్ రూ.6వేల నగదును వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించాడు. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అప్పటికే అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ సీఐ సునీల్‌కుమార్ చేతుల మీదుగా డబ్బులను బాధితుడికి అందజేశారు. ఆటో డ్రైవర్‌ను సీఐ, పోలీసులు అభినందించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న తుల శ్రీనివాస్

బోథ్: సొనాల మండలంలోని సాకేర గ్రామ మాజీ సర్పంచ్ ధరావత్ మీరాబాయి, బోథ్ మండలంలోని కుచులపూర్ గ్రామానికి చెందిన కారెం శివన్న ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతి తెలిపారు వెంట మాజీ సర్పంచ్‌లు శ్రీధర్ రెడ్డి, చంద్రమోహన్, బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, స్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

తాంసి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో డీసీసీబీ చైర్మన్ సమక్షంలో మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సంతోష్, నాయకులు శ్రీధర్ రెడ్డి, నారాయణ, హన్మండ్లు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో అర్కగూడ

- 20ఏళ్లుగా పూర్తికాని ప్రాజెక్ట్ పనులు
- శిథిలమవుతున్న నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



కూలిపోయిన డయాఫ్రం వాల్



కూలిన కాంక్రీట్ మత్తడి అప్రోచ్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ వద్ద 4వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యంతో నిర్మించ తలపెట్టిన అర్కగూడ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురవుతోంది. 20ఏళ్ల క్రితం ప్రారంభించిన పనులు నేటికీ పూర్తి కాలేదు. ప్రాజెక్టులో భాగంగా చెరువు నిర్మాణం పూర్తయినా కాలువలు పూర్తికాక పోవడంతో నిండా నీరున్న ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకుంటోంది.

2005లో ప్రారంభం..

అర్కగూడ ప్రాజెక్టును రూ.12కోట్ల అంచనా వ్యయంతో 2005లో ప్రారంభించారు. 2010లో ప్రాజెక్టు చెరువు పనులు పూర్తి కాగా ప్రాజెక్టు కింద బాబాసాగర్, చీపురుదుబ్బ, డబ్బా గ్రామాల భూములు ముంపునకు గురయ్యాయి. 247 మంది రైతులకు చెందిన 627 ఎకరాల భూమికి ఎకరానికి రూ.80వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రివిట్‌మెంట్, మత్తడి, 2 డయాఫ్రం వాల్స్, ప్రాజెక్టు కట్టలను నిర్మించారు. మత్తడి కింద నీళ్లు మళ్లిస్తూ ప్రవహించడానికి వీలుగా రెండు చోట్ల అప్రోచ్‌వాల్స్ నిర్మాణం చేపట్టారు.

కాలువల పనుల్లో జాప్యం..

సాగునీరు పంట భూములకు అందించేందుకు 4 కిలోమీటర్ల ఎడమ కాలువ, 4 కిలోమీటర్ల కుడి కాలువను నిర్మించాల్సి ఉంది. కాలువ పనుల్లో భాగంగా సుమారు 109 ఎకరాల భూమిని రైతులు కోల్పోతున్నారు. రైతులకు ప్రస్తుత రికార్డుల ప్రకారం ఎకరానికి రూ. 3లక్షలను ప్రభుత్వం చెల్లిస్తోంది. 2010లో ప్రాజెక్టు చెరువు పనులు పూర్తయ్యాయి. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం చెరువు పూర్తి స్థాయిలో నిండి మత్తడి పారుతోంది. ప్రాజెక్టు పనులను ప్రభుత్వం నిబంధనల ప్రకారం 2013లో పూర్తి చేయాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణం అనంతరం కాలువ పనులు ప్రారంభించాల్సి ఉండగా జాప్యం జరిగింది. భూసేకరణను అధికారులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో కాలువ పనులు ప్రారంభం కాలేదు. కొన్నేళ్ల క్రితం నుంచి పనుల నిర్వహణ నిలిపివేశారు. ఎడమ కాలువ పనులు చింతలమానెపల్లి మండలకేంద్రం సమీపంలో నిలిచిపోగా కుడి కాలువ పనులు 70శాతం పూర్తయ్యాయి.

నాసిరకం నిర్మాణాలు..

ప్రాజెక్టు కట్టకు నీరు నిల్వ ఉన్న వైపు నిర్మించిన రివిట్‌మెంట్ నిర్మాణంలో సిమెంటు వినియోగించ లేదు. రాళ్లతో నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం, నిలువ ఉధృతికి రాళ్లు కట్టలోకి కుంగిపోయాయి. కట్ట మీది నుంచి వర్షం నీరు కిందకి ప్రవహించడానికి వీలుగా కాలువలను తక్కువగా నిర్మించడంతో నీళ్లు కట్టనుంచి ప్రవహిస్తూ కట్టను కోతకు గురి చేస్తున్నాయి. కట్ట మీది నుంచి నిర్మించిన కాలువలు సైతం శిథిలమయ్యాయి. మత్తడి నుంచి పారుతున్న నీరు పక్కకి ప్రవహించకుండా నిర్మించిన సైడ్‌వాల్, డయాఫ్రం వాల్స్ నిర్మాణంలో గుత్తేదారు నాణ్యతకు తిలోదకాలివ్వడంతో కూలిపోయాయి. రెండో డయాఫ్రం వాల్ పూర్తిగా శిథిలం కాగా మొదటి డయాఫ్రం వాల్ సగం కూలిపోయింది. ఈ నిర్మాణాలపై అప్పట్లోనే నాసిరకంగా నిర్మిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. మత్తడి నుంచి వచ్చే నీటి ఉధృతిని తగ్గించడానికి, వాగు ప్రవాహంలో భూమి కోతకు గురికాకుండా నిర్మించిన కాంక్రీట్ అప్రోచ్ గత కొద్ది రోజుల క్రితం కూలిపోయింది. సుమారు 50 మీటర్లకు పైగా కోతకు గురికాగా నేలలోకి కుంగిపోయింది. కాంక్రీట్‌తో సహా కూలిపోవడం ప్రాజెక్టు నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది.

భూసేకరణ, చెల్లింపుల్లో నిర్లక్ష్యం..

ప్రాజెక్టు పనుల్లో భాగంగా భూసేకరణలో మొదటి నుంచి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని రైతులు ఆరోపిస్తున్నారు. భూములు కోల్పోతున్న అర్హులకు నష్టపరిహారం చెల్లించకుండా అనర్హులకు చెల్లించారని రైతులు కోర్టుకెళ్లారు. మరోవైపు కొంతమంది పెద్దమనుషుల లాభం కోసం కుడి కాలువ నిర్మాణాన్ని మళ్లించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎడమ కాలువ పనులను గుత్తేదారు చెరువు వద్ద నుంచి ప్రారంభించకుండా కాలువలు ముగిసే చోటు నుంచి ప్రారంభించారని, గుత్తేదారు లాభం కోసం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారని రైతులు ఆరోపిస్తున్నారు. బాబాసాగర్ గ్రామం నోటిఫైడ్ గ్రామం కాగా అధికారులు సజావుగా సర్వేలు నిర్వహించకుండానే నష్టపరిహారం జాబితాను తయారు చేయడం గమనార్హం.

చర్యలు లేవు..

గతంలో పలుమార్లు ప్రాజెక్టు కట్ట కుంగిపోవడంతో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. తాజాగా గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నీటి పారుదల శాఖ డీఈ భానుమూర్తి, ఇంజినీరింగ్ అధికారుల బృందం ప్రాజెక్టును పరిశీలించింది. ఉన్నతాధికారులకు పరిస్థితిని నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలో శాఖ ఎస్ఈ పరిశీలిస్తారని గ్రామస్తులకు తెలిపారు. గతంలో అధికారులు పరిశీలించిన సందర్భాలలో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రిటైనింగ్ వాల్, డయాఫ్రం వాల్ కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన విద్య అందించాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కౌటాల ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శనివారం మండలంలోని కుంబారీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం పెట్టాలని తెలిపారు. ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ ఉంచాలని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు దీక్ష, గణపతి తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాల్లో బీజేపీ నాయకులు

చింతలమానెపల్లి: ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో మండలంలో బీజేపీ నాయకులు శనివారం సాయంత్రం సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో టపాసులు కాల్చి బీజేపీ అనుకూల నినాదాలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి విధానాల కారణంగానే ఢిల్లీలో విజయం సాధించిందని బీజేపీ మండల అధ్యక్షుడు రామన్న ఈసందర్భంగా అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్ములె మల్లయ్య, తుకారాం, భీమేశ్, నాగపురి మోహన్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు'కు దీటుగా ప్రత్యేక తరగతులు

- 'పది'లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- మండలంలో ఆరు పాఠశాలలు, 353 మంది విద్యార్థులు



వాంకిడి జెడ్పీఎస్ఎస్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

వాంకిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా జిల్లా యంత్రాంగం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. పదో తరగతి వార్షిక పరీక్షలకు గడువు ముంచుకొస్తుండటంతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీఅవర్స్ నిర్వహిస్తూ విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. గతంలో కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు రాబట్టుకోవాలనే ప్రణాళికతో తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు తరగతులు బోధిస్తూనే మరోవైపు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా సబ్జెక్టుల టీచర్లు నిత్యం క్రమం తప్పకుండా స్టడీ అవర్స్ నిర్వహిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ప్రణాళిక ఇలా..

'పది' విద్యార్థుల ఫలితాలను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడకుండా అల్పాహారం పంపిణీ చేస్తోంది. దీంతో ఉదయం 8 గంటల నుంచి 9.15 వరకు సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. గతేడాది పదో తరగతిలో మొత్తం ఉత్తీర్ణత 70 శాతం ఉండగా ఈ ఏడాది ఉత్తీర్ణత 100 శాతం ఉండాలని విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉదయం గంట, సాయంత్రం గంట పాటు సబ్జెక్ట్ టీచర్లు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు సాయంత్రం స్టడీ అవర్స్‌లో ఒక స్లిప్‌టెస్ట్ నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్నారు. వారిని ఫలితాలకు అనుగుణంగా సన్నద్ధం చేస్తున్నారు. డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి చేసి జనవరి నుంచి రివిజన్ తరగతులతో పాటు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు.

353 మంది విద్యార్థులు..

మండలంలో జెడ్పీఎస్ఎస్ పాఠశాలలు 3, గిరిజన ఆశ్రమ హైస్కూల్స్ 2, కేజీబీవీ 1, మొత్తం ఆరు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కేజీబీవీలో 38, బంబార ఆశ్రమ పాఠశాలలో 27, వాంకిడి ఆశ్రమ పాఠశాలలో 59, ఇందాని హైస్కూల్‌లో 16, ఖిరిడి హైస్కూల్‌లో 21, వాంకిడి హైస్కూల్‌లో 192 మంది మొత్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 353 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జెడ్పీఎస్ఎస్ పాఠశాలలకు వెళ్లే పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం అందిస్తుండటంతో గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ఉపయోగకరంగా మారింది. నిత్యం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు.

ప్రత్యేక తరగతులకు హాజరు



ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులకు నిత్యం హాజరవుతున్నాను. ప్రతీరోజు ఖమాన గ్రామం నుంచి వస్తాను. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక బోధన అందిస్తున్నారు. ఉత్తమ ర్యాంకు సాధించాలనే పట్టుదలతో చదువుకుంటున్నాను.

– ఎల్.హాసిక, 10వ తరగతి

నివృత్తి చేసుకుంటున్నాం..



ప్రత్యేక తరగతులలో సబ్జెక్టుల పరంగా ఎలాంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ప్రతీరోజు స్లిప్‌టెస్టులు సైతం నిర్వహిస్తుండటంతో వార్షిక పరీక్షల నాటికి ఎలాంటి భయాలు లేకుండా ప్రతిభ కనబరుస్తాం. అల్పాహారం సైతం అందిస్తుండటంతో చదువుపై ఆసక్తి పెరిగింది.

– బి.రాహుల్, 10వ తరగతి

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా స్లిప్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు వెలికి తీస్తున్నాం. వారి ఫలితాలకు అనుగుణంగా పిల్లలపై దృష్టి సారిస్తూ ప్రణాళిక రూపొందిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూసుకుంటున్నాం.

– నటరాజ్, హెచ్ఎం, జెడ్పీఎస్ఎస్, వాంకిడి

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా తరగతులు నిర్వహిస్తున్నాం. మండలంలో మొత్తం ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 353 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. డిసెంబర్‌లోనే సిలబస్ పూర్తికాగా ప్రస్తుతం రివిజన్ చేస్తూ ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నాం. చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

– శివచరణ్, ఎంఈవో, వాంకిడి

పీఆర్పీ చెల్లింపులు త్వరగా జరపాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థలో పని చేస్తున్న అధికారులకు 2022 –23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పీఆర్పీ (పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే)ని చెల్లించేలా కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా అధికారుల సంఘం కార్యదర్శి వీరన్న కోరారు. ఈ మేరకు శనివారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్‌ను అధికారుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 –23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పీఆర్పీని కోల్ ఇండియాలో 2024, జూన్‌లో చెల్లించినప్పటికీ సింగరేణి సంస్థలో పని చేస్తున్న అధికారులకు మాత్రం ఇప్పటివరకు చెల్లింపులు కాకపోవటంతో అధికారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. త్వరితగతిన పీఆర్పీ చెల్లింపునకు ఏర్పాటు చేయాలని, అధికారుల సంఘంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన సమస్యల పరిష్కారానికి తగు ఆదేశాలు జారీ చేసేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఎంవోఏఐ ఉపాధ్యక్షులు రమేశ్, ఉజ్వల్‌కుమార్ బెహరా, సంయుక్త కార్యదర్శులు నరేశ్, ఎండీ దావూద్ అహ్మద్, కోశాధికారి రవికుమార్, సంయుక్త కోశాధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



పరిచయం చేసుకుంటున్న సోయం బాపూరావ్

బజార్‌హత్నూర్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మాజీ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. శనివారం మండలంలోని చింతలసాంగ్వీ గ్రామంలో ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీలు మల్లేపూల నర్సయ్య, మునేశ్వర్ నారాయణ, మాజీ ఎంపీటీసీ విజయ సుంగన్న, గ్రామ పటేల్ భీంరావ్, సిడం సుభాష్, జల్కే పాండురంగ్, శివుడు, శేఖర్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పరామర్శ

ఇచ్చోడ: ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్ కుటుంబాన్ని శనివారం మాజీ ఎంపీ సోయం బాపూరావ్ పరామర్శించారు. వారి కుటుంబసభ్యులతో మాట్లాడి మృతికి గత కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నారాయణ్‌రెడ్డి, కుంర కోటేశ్వర్, మాధవ్ పటేల్, జాలైజాకు, బత్తుల అశోక్, అక్కెపెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

తలమడుగు: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని మాజీ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. శనివారం మండలంలోని ఝరి, పునగుడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తుందన్నారు. రైతులకు, రైతు కూలీలకు, ప్రభుత్వ ఉద్యోగులకు, నిరుద్యోగులకు, మహిళలకు, ప్రజాప్రభుత్వంలో పెద్దపీట వేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉండి కనీసం వార్షిక సంవత్సరంలో 20 పని దినాలు పనిచేసిన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింప చేయడం జరుగుతుందన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. కొట్టాల మోహన్‌కు చెందిన గేదె రోజులాగే మేత కోసం వెళ్లగా చేను వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తాకి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

కళా ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఎదులాపురం: తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్మల్ జిల్లా అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ కళలు సాహితి సంస్కృతి కవులు, కళాకారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళాకారుల కమిటీ బాధ్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం సమ్మేళన కరపత్రాలు ఆవిష్కరించారు. 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమంలో భాగంగా కళా ఉత్సవ అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. 11న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమ్మేళనం కొనసాగుతుందన్నారు. భక్తిగీతాలు, కూచిపూడి, భరతనాట్యం, కోలాటబృందం, ఒగ్గు, డోలు, గుస్సాడీ నృత్యం, డప్పుల బృందం, ఫోక్, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని కళాకారులు విజయవంతం చేయాలన్నారు.

రుణాలు వెంటనే మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సిర్ర దేవేందర్

ఎదులాపురం: 2021–22లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. రుణం కోసం 234 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ముగ్గురికి ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ అభివృద్ధి చెందకుండా కుట్రలు చేసిందని ఎస్సీ కార్పొరేషన్ నిధులను వేరే పథకాలకు వాడుకొందన్నారు. ఇప్పుడున్న ప్రజాపాలన ప్రభుత్వం దృష్టి సారించి రుణాలు మంజూరు చేయాలన్నారు.